# స్నేహం

'ఫెళ ఫెళ ఫెళప్... ఫెళప్... ఫెళప్' మంటూ 'ఫడీల్!' మందో ఉరుము.

"ఎక్కడోగాని మా గనంవైన పిడుగు పడ్డది!" అన్నాడు నరసింహులు.

నరసింహులంటే డాక్టర్ గోపాలరావుగారి ఆఫీస్ బోయ్-కమ్- కాంపౌండర్.

"అది నిశ్చయంగా పిడుగే" అంటూ బలపరిచేడు రాజారావు. రాజా రావంటే ఇటీవల డాక్టరుగారితో చెలిమి బాగా ముదిరిపోయిన మల్లెపూల రాయుడు.

అంత జరిగితే తలెత్తి చూసేడు డాక్టరు. ట్యూబులైటు నిరంతరాయంగా వెలుగుతూనే ఉంది. సీలింగ్‌ఫాన్ రొదలో మార్పేమీ రాలేదు. ఉండుండి మెఱుపులు! వాటి కాంతిలో వర్షపు జోరు హెచ్చినట్టు కనిపిస్తోంది.

మళ్ళా ఎప్పటి స్థితికే వచ్చేడు డాక్టరు.

"బయట అంత కుండపోతగా వర్షం కురుస్తోంటే ఈ ఉక్క చూడండి!"

తెల్లని పాముకుబుసాల్లాంటి తన బట్టలలోకి ఒకసారి చూసుకొని చుట్టూ జవునుకున్న ఫర్నిచర్‌వంక చీదరగా చూసేడు రాజారావు.

డాక్టర్లో చలనమేమీ లేదు. "ఇహ ఇవేళ కితనింతే" అనుకుంటూ పేపరు తీసేడు రాజారావు.

డాక్టరు వేణుగోపాలరావు గారంటే ఈ మధ్యనే వచ్చి వెళ్ళిన ఎలక్షన్లలో వార్డు గెల్చుకొని పేషెంట్లను పోగొట్టుకొన్న ఛోటా వి.ఐ.పి. పునరావాసం యిప్పుడిప్పుడే ప్రారంభమౌతోంది. మూడు రోజులై ముసురూకాకుండా, ఎండా అనకుండా కురుస్తోంది వర్షం. సాయంత్రం ఐదు గంటలకు ఉప్పెనలా ముంచుకొచ్చిన కారుమేఘాలు ఆరున్నరైనా విడవకుండా కురుస్తున్నాయి. నేరకపోయి వచ్చిన పేషెంట్లు ఎలాగో బయటపడ్డారు. కాని క్రొత్తవాళ్ళు రావడం లేదు. ఆ తీరికవల్ల డాక్టర్లో ఏర్పడ్డ చిరాకు మలేరియా రోగి టెంపరేచర్లా అదేపనిగా పెరిగిపోతోంది.

"పోనీ ఏదైనా సినిమాకు పోదాంవేవిటి?"

కొంతసేపు పేపరు చూసేక అడిగేడు రాజారావు.

ఒక 'ప్చ్' ని తుపాకి గుండు వేగంతో పేల్చి తల అడ్డంగా విసిరేసేడు డాక్టరు. కథ ఇంకా తీవ్రంగానే ఉందని గ్రహించి ఊరుకున్నాడు రాజారావు.

మూర్ఛొస్తే మూర్ఛరోగులు ఎలా మెలికలు తిరిగిపోతారో గోపాలరావులోని మందు మనిషి అలా కిరకిరా నులనులా చుట్టుకోవడంతో ఆరంభించి, పాప్ మ్యూజిక్ మత్తునపడ్డ పడుచువాళ్ళలా శివమెత్తి తెయ్యిమంటూ హిప్పీ డాన్సు చేసేస్తున్నాడు. మూడు రోజులై మొండిగా కురుస్తున్న వర్షంమీదా – మొదట తానుగా ప్రేరేపించి ఇప్పుడు మొండి చెయ్యి చూపుతున్న రాజారావు మీద – అతణ్ని నమ్ముకొని ఆలోచించకుండా మీనాక్షీదేవికి ఎప్పాయింట్‌మెంట్ ఇచ్చిన తన అవివేకం మీదా – అన్నిటికన్నా – అవసరం పడ్డదంటే – ముప్పై రూపాయలు – ముష్టి ముప్పైరూపాయలు –పుట్టించే మార్గం తోచని తన అసమర్థత మీద – కోపం –పట్టరాని కోపం పుట్టి శరీరాన్ని కుతకుత ఉడికించేస్తోంది. ఉడికి ఉడికి –

"అసలు సంగతేమంటే ఇవాళ నా కున్నంత వెష్ఠ మీకు లేదు. అందుచేతే పని యిలా గుడ్డు గుడిపించేసేరు" అన్నాడు డాక్టరు.

భావించినంత ముతగ్గానూ భాషించ లేకపోయినందుకు అతనికి చిరాగ్గా ఉన్నట్టుంది.

"అదిగో అలా మాటాడితేనే వస్తుంది చిరాకు" రాజారావు మొహం గంటు పెట్టుకొని అన్నాడు.

"లేకపోతే ఏమిటి సార్! మీరు రోజల్లా ప్రయత్నం చేస్తే ముష్టి ముప్పై రూపాయలు పుట్టించలేక పోయానంటారు; ఆ మాట నన్ను నమ్మమంటారు.

"మహాప్రభో, మా ఆఫీసు పని ఒత్తిడిలో నాకు ప్రయత్నించే అవకాశం కలగలేదంటే నమ్మరేం?"

రాజారావు నవ్వుతూనే అన్నాడు గాని అతని కళ్ళల్లో ఆ నవ్వు లేదు.

"అయితే ఆ సంగతి నాకు ఫోన్‌చేయవలసింది!"

"అదే నావల్ల జరిగిన పొరపాటు."

చేతులు కూడా జోడించాడు రాజారావు.

"పోనీ డిస్పెన్సరీకి రాకముందు తెలిసినా నా పాట్లేవో నే పడుందును. ఇప్పుడిక్కణ్ణుండి ఎవరి దగ్గరకని పంపగలం; దేనికని అడగ్గలం? ఈ వేళప్పుడు – అందులో ఇలాంటి సమయంలో ఎవణ్ణి డబ్బడిగినా వెధవ మొహం వేసుకొని ముందనవ్వు నవ్వుతాడు.

డాక్టరుగారి కోపం – ఆ ముఖాలూ నవ్వులూ, ఊహించుకోవడం వల్ల కలిగిందో, అప్పుడు తను పెట్టవలసే ముఖం తలచుకోవడం వల్ల కలిగిందో చెప్పలేం.

"పోనీ పేషెంట్లెవరైనా దొరుకుతారేమో అంటే వాళ్ళూ కనిపించడం లేదు! మొగుడు చచ్చి ముండేడుస్తుంటే, రంకు

మొగుడు కొంగట్టుకు లాగాట్ట – అలా ఉందీ వర్షం!"

అదే వచ్చిపడ్డ అసలు చికాకు. ఈ వర్షమే లేకపోతే నాలుగిళ్ళు ముష్టెత్తి యినా రాజారావే ఓ నలభై రూపాయలు ఈజీగా సంపాదించి ఉండేవాడు. అసలా తొత్తుకొడుక్కూడా ఏభై రూపాలిస్తానంటే మిగిలిన ముష్టికి అరు వుండేవాడు.

ఏం చెయ్యడానికీ పాలుపోనీ డాక్టరుకు కాలుస్తున్న సిగరెట్ కూడా వెగటయ్యింది. దాన్ని సగంలో నలిపేయడంతో తృప్తిపడక బయటికి వెళ్ళి వర్షంలో దూరంగా విసిరేసి వచ్చేడు.

వస్తూ వస్తూ –

"ఆ యాభై రూపాయలూ యేం చేసేరు!" అన్నాడు – అదైనా ఉందా అన్న ధోరణిలో.

కాని రాజారావుకి అలాంటివి తగలవ్.

"నా దగ్గరే వున్నది" అన్నాడు జేబులో చెయ్యి పెట్టపోయి మానేస్తూ.

"మరీలోగా వాడిం కెవరికైనా అమ్ముకు దొబ్బితే."

"డొక్క చెక్కేనూ? ఎనిమిదీ ఎనిమిదిన్నర మధ్య వస్తానన్నాను. తొమ్మిది గంటలు డెడ్‌లైనిచ్చేను."

వాచీలో ఏడుకీ రెండు నిముషాలు తక్కువగా ఉంది. కొన ప్రాణంలో ఉన్న రోగిని బతికించడానికి బాధపడే వైద్యుడిలా టేబుల్ మీద ఓరగా కూర్చుని ఆలోచిస్తున్నాడు డాక్టరు. టేబులు మీద పెట్టెలో సిగరెట్లు ఒట్టిపోవడం చూసి నరసింహానికి డబ్బులిచ్చి పంపేడు రాజారావు. అతడు తిరిగొచ్చేసరికి ఎవరో ఇద్దరు కొత్తవాళ్ళు గుమ్మం ఎక్కుతున్నారు.

## 2

నలభైయైదేళ్ళ కాయశరీరం యీ మధ్యనే తత్వం ఫిరాయించి వాతాన పడుతున్నటుంది. మూడొంతులు తెల్లపడ్డ మీసాలూ, గడ్డం, ఒకటిన్నర రోజులకు ఏపుగానే పెరిగాయి. విశాలమైన నుదుటను తీర్చిన గంధాక్షతల్లో గంధం శిధిలమయ్యింది. వేసుకున్న ఖద్దరు బట్టలు అతి భద్రంగా వాడుతున్న వాడిలా కదుల్తున్నారు.

గొడుగూ చెప్పులూ గుమ్మంవద్ద వదిలి వెనుకనున్న ఇరవై యేండ్ల కుర్రాణ్ని ముందుగా గదిలో ప్రవేశపెట్టేడు. ఆ వెంట తనూ లోపలికి వచ్చి "నమస్కారం" అంటూ అక్కడున్న ముగ్గురికేసీ పరిశీలనగా చూస్తున్నాడు.

ఆ కుర్రాణ్ని చూసీ చూడగానే 'ఎవరో యనరా దిత దాతని బిడ్డయే' అన్నట్టున్నాడు.

"కమాన్ సార్ కూర్చోండి" అన్నాడు కుర్చీ చూపిస్తూ – రాజారావు.

దానితో వచ్చిన ఆసామీ కాస్త కంగారు పడడ్డట్టున్నాడు. అంతవరకూ అతను గోపాలరావునే డాక్టరు గారనుకుంటున్నాడు. ఇప్పుడు రాజారావు ఆహ్వానించడం, డాక్టరుగారి కుర్చీ కాళీగా వుండటం చూసి –

"డాక్టర్ వేణుగోపాలరావుగారు..." అంటూ గోపాలావు ముఖంలోకే చూస్తూ నీళ్ళు నమిలాడు. అతను "నేనే, యేం కావాలి?" అనటంతో మీట నొక్కిన ట్యూబులైటులా ముఖం మిల మిల మెరిసిపోయింది.

"నా పేరు వేములకొండ శివరామయ్య. మాది బొబ్బిలి తాలూకా నంది వాడ గ్రామం" అన్నాడు పూర్తిగా వెలిగిన ముఖంతో.

డాక్టరు కొంచెంసేపు యేం వింటున్నాడో తెలియనివాడిలా చూసి, తన కళ్ళను తానే నమ్మలేని వాడిలా, "ఎవరు, బుచ్చిదొడ్డమ్మగారి శివయ్యా?" అన్నాడు శివయ్యను చూస్తూ.

శివయ్య అవునన్నట్టు తలూపేడు.

"ఓరి ఓరి ఓరి..." అంటూ గోపాలరావు పరమానందం పడిపోతులేచి వెళ్ళి కావులించుకున్నంత పనిచేశాడు. తరువాత "ఎక్కడున్నావు? యేం చేస్తున్నావు? ఎప్పుడొచ్చావు?" ప్రశ్నలతో తనే ఉక్కిరి బిక్కిరైపోతూ కుర్చీలో కూర్చోబెట్టుకున్నాడు. ఆయనగారి ముఖం చూస్తే పావుగంట క్రితం ప్రాణ సంకటంగా కొట్టుకుంటున్న డాక్టర్రోగితడేనా – అన్నట్టున్నాడు.

తరువాత వాళ్ళిద్దరూ బాల్యచరిత్రలు తవ్వుకోవడం ఆరంభించేరు.

శివయ్య హైస్కూల్లో చదువుతుండగానే పెళ్ళయ్యిందట. ఆ విషయం అతడు వైనాలతో జ్ఞాపకం చేస్తేగాని గుర్తుకురాలేదు గోపాలరావుకు – తరువాత భీమునిపట్నంలో ట్రైనింగై జిల్లా బోర్డులో మేస్టరుగా ప్రవేశించడం – అతనికి బాగా గుర్తుంది. ఆ తరువాత అతని అజాపజా పాతికేళ్ళదాకా తెలియరాలేదు. విజానారం ప్లాటుఫారం మీద ఒహో అంటే ఒహో! అనుకున్నారోసారి – ఈ పాతికేళ్ళలో ఛప్పన్న గ్రామాలూ తిరిగి టెక్కలి దగ్గర రావులపాడేరు హైస్కూల్లో ఐదారేళ్ళయి నిలదొక్కుకొని ఉన్నాడు శివయ్య. సంసారభారం క్వాలిఫికేషన్సు ఇంప్రూమెంటుకి ప్రతిబంధకం కాగా మొన్ననే ఏడాది క్రితం తెలుగు బియ్యేడి అనిపించుకున్నాడు. ఇద్దరాడపిల్లల్లో ఒకర్తి పెళ్ళయి కాపురానికి వెళ్ళింది. ఇంకొకర్తి పెళ్ళికెదిగి కూర్చుంది. తరువాత వరసగా అయిదుగురు మగపిల్లలు. ఆఖర్న వో ఆడపిల్ల.

"ఇంకా చూస్తావెందుకోయ్ – కోయించెయ్"

"కోయించేయడానికి మానేడానికీ మన మెవరం! వాళ్ళే

బలవంతాన వాన్‌లో పడేసుకుపోయి కోసిపారేస్తున్నారు."

ఫకాల్మన్నారు ముగ్గురూ.

"నేనూ మా పెద్దల్లుడూ ఒక్కసారే ఎక్కేం టేబులు."

మళ్ళా ఫకాల్మన్నారు.

ఈ విధంగా కొంతసేపు సాగేక శివయ్య ప్రశ్నలు ప్రారంభమయ్యాయి – "అన్నట్టు నువ్వు మీ మేనమామ కూతుర్నే కదూ చేసుకున్నావు?"

''అబ్బే లేదే. ఆవిడే నన్ను పెళ్ళాడింది. నాకు ముగ్గురాడపిల్లలూ, ఒక కొడుకూ" అని శివయ్య నవ్వాపేలోగా "కొడుకు పుట్టేక నేనింక పిల్లల్ని కనలేనంది మా ఆవిడ. కనలేకపోతే మానేయ్ అన్నాను. ఆపరేషను చేయించుకో అంది. నీకృష్టవస్తైప్పి రేప్పొద్దున నా పీక కోయించుకోమంటే నే నెక్కడ కోయించు కోగల్ను? ఆ ఏడ్పు ఏదో నువ్వేఏడు అన్నాను. తనే చేయించుకుంది."

"కుర్రా డెన్నేళ్ళవాడు?"

"పన్నెండు. అంతా చదువుల్లో ఉన్నారు" అని "ఒకసారి మా యింటికి రా" అన్నాడు చెవిటివాడితో చెప్పినట్టు.

"మీ మావఁగారు కులాసానా?"

"ఇంకా వుండమన్నా? ఆస్తంతా కూతురుపేరన పెట్టి నీకు చదువు చెప్పించాను, ఫో పొమ్మన్నాడు – ముష్టి రాస్కెల్" అంటూ కసంతా వెళ్ళగక్కేడు గోపాలరావు.

ఈసారి శివయ్య కొంత పస్తాయించేడు.

"అయితే మనం మారలేదన్నమాట?" అన్నాడు నానుస్తూ – గొంతు తగ్గిస్తూ, కాని గోపాలరావు గొంతు తగ్గలేదు.

"ఎందుకు మారతాం? ఏనాడైతే మా మాఁవ, నన్ను బాగుచేస్తానని చెప్పి తీసుకెళ్ళి, గుప్‌చుప్‌గా ఇల్లరికఁవల్లుణ్ని చేసుకున్నాడో; ఆనాడే నిశ్చ యించేసేను – సరే మాఁవా నీ కోరికే తీరనీ, నీ పిలక నాచేతికి చిక్కేకే నీ పని పడతాను అనుకున్నాను. ఆ విధంగానే పట్టి చూపించేను."

ఏవిధంగానని శివయ్య అడగలేదు. గోపాలరావే చెప్పేడు "వాడి కూతురుకి ఒక్కూతురు పుట్టిందాకా ఓర్చేను. ఆ తరువాత చచ్చిందాకా మా మాఁవ యేడవని రోజులేదు." శివయ్య మాటాడలేదు.

"చచ్చేముందు పోనీ ముసిలాడన్చెప్పి కొంత జాలి చూపించేను. మంచఁవెక్కి ఆరుమాసాలు తీసుకున్నాడు. ఆ ఆరుమాసాలూ నాచేత సేవకూడా చేయించుకున్నాడు. ఇంతా చేస్తే నీ పేర సగం ఆస్తి రాస్తాను ఏమంటా వన్నాడు. పో ఫోస్; నువ్వూ నీ ఆస్తి గంగలో దూకండి. నాకొచ్చేది నా ఖర్చులకు సరిపోతుంది. నీ కూతురికి కావలస్తే ఇంటికొస్తాను – లేకపోతే నీ గుమ్మంకూడా తొక్కను పొమ్మన్నాను. మరేఁ వనుకున్నాడో మనకీ డిస్పెన్సరీతో యీ యిల్లూ – మనవడి పేర పాతికవేలు పెట్టి, దాని గార్డియన్ షిప్పూ – అప్పజెప్పి మిగతాదంతా కూతురు నెత్తిమీద పెట్టిపోయేడట – మనం ఆ విల్లే చూడలేదు – ఎలాగో తగలడండన్నాను. మన చేతుల మీదే పిడికెడు దుమ్ము చేసేసి పారేశాం. దాంతో ఋణం చెల్లన్నాను..."

ఇప్పుడు భార్యాభర్తల సంబంధాలెలా ఉన్నాయో తెలుసుకోవాలని శివయ్యకు మహా ఇదిగా వుంది. అడిగితే గోపాలం నోటివెంబడి ఎలాటి కబుర్లు వినవలసి వస్తాయో అని భయంగా వుంది. కొంచెం సేపు చూసి అడిగేడు.

"ఇల్లెక్కడ?"

"కొత్తగ్రహారంలో బీచొద్దున. పద్మావతీ భవన్ అంటే ఎవరైనా చెప్పేస్తారు. లేకపోయినా కాస్త తలెత్తి చూస్తూవస్తే తాటికాయలంతేసి అక్షరాల్తో మా మావ గొప్పగా చెక్కించుకున్న కూతురు పేరు ఇక్కడే నేనున్నానని పిలుస్తూ వుంటుంది."

ఏ ప్రశ్నతో రేపినా ప్రమాదంగా కనిపించేసరికి శివయ్య నోరు మూసుకోవ డం మంచిదనుకున్నాడు.

"జడిసిపోకు. మనసంగతెలా ఉన్నా మన స్నేహితులకు ఇంట్లో మర్యాద లోపం జరగదు. అందులో నీలాటి వాళ్ళంటే మా ఆవిడ బాగానే చూసు కుంటుంది."

"నాలాటీ అంటే నేను జ్ఞాపకం వున్నానా?"

"ఎందుకుండవ్? ఆ మధ్య మీ పార్వతీశం బావ కనపడి మీ అందరి గురించీ చెపితే ఇంటి దగ్గర చెప్పేను. బొబ్బిల్లో చిన్నప్పటి మన రొమాన్సుల గురించి నువ్వు మా మేనమామకు రాసిన ఉత్తరాలూ – పన్నెండో ఏట అది మా ఇంటికొచ్చినప్పుడు బుచ్చి దొడ్డమ్మగారు మీ వంటింట్లో దాన్ని కూర్చోపెట్టి నన్నప్పట్లో దక్కించుకోకపోతే నేను చెడిపోవడం తప్పదనీ, చచ్చి ఏ లోకానో ఉన్న ఉత్తమ యిల్లాలు మా అమ్మప్రాణం ఉసూరుమంటుందనీ నచ్చచెప్పడం – పెళ్ళయితే మనం మారిపోతామనీ గొప్పవాళ్ళం కావలసిన లక్షణాలు బోలెడున్నాయనీ నువ్వు సర్టిఫై చెయ్యడం – ఏదీ మరిచిపోలే దావిడ!"

ఈసారి శివయ్యకు ధైర్యం వచ్చినట్టుంది.

"ఇప్పుడు మాత్రం అందుకు తభావతు యేం వచ్చింది? ముప్ఫైయేళ్లు నిండకముందే నటచక్రవర్తి బిరుదుతో ఆంధ్ర దేశమంతా దిగ్విజయ యాత్ర చేసేవ్. తరువాత నువ్వాడిన నాటకాలకోసం జనం కొట్టుకు చచ్చేవారు. నేను పొందూర్లో ఉండగా శ్రీకాకుళంలో నీ నాటకం ఉందంటే – బస్సు దొరక్క నేనూ, నా స్నేహితులూ 15 మైళ్ళు సైకిళ్ళు తొక్కుకొచ్చేము.

తరువాత సంగీత నాటక ఎకాడమీలో సభ్యుడవయ్యేవని పేపర్లో చూసేను. ఒక టెర్మ్ యెమ్మెల్సీ చేసేవు. ప్రస్తుతం నగర రాజకీయాల్లో పాల్గొంటూ కౌన్సిలర్‌వి! వీసంలో తప్పిపోయింది గాని వైస్ చైర్మన్ అవ్వవలసిందంట."

స్నేహితుడు తన ఘనతను ప్రశంసిస్తుంటే గోపాలరావు కండ్లలో కనిపించ వలసినంత వెలుగు కనిపించడంలేదు. పైగా –

"అని నువ్వనుకుంటున్నావు" అన్నాడు ఎటో చూస్తూ.

"అంటే...." అని ఆగిపోయేడు శివయ్య. తరువాత ప్రక్కనున్న రాజారావు ముఖంలోకి చూసి మనసు మార్చుకున్నాడు.

రాజారావు పేషంటో, ఫ్రెండో గోపాలరావు పరిచయం చేయలేదు. గోపాల్రావు మాటాడిన విషయాలు ఫ్రెండ్లముందు మాటాడవలసే అవధులు కూడా దాటి పోయినట్టున్నాయి. అందుచేత ఇంకా మాట్లాడించడం భావ్యమని పించలేదు శివయ్యకు.

అయితే రాజారావు ఆవలిస్తే పేగులెక్కెడతాడు. శివయ్య ఉద్దేశం గ్రహించి చిరునవ్వు నవ్వుతూ అన్నాడు.

"డాక్టరుగారికి ఫ్రెండ్సుని చూస్తే మతిపోతుంది... ఆయనకు మీరు బాల్య స్నేహితులైతే, నేను ఈనాటి స్నేహితుణ్ని! నా పేరు డి.రాజారావు, పోర్టులో డ్రాఫ్ట్స్‌మన్‌గా పనిచేస్తున్నాను."

"నమస్కారం" అన్నాడు శివయ్య.

"సారీ అండీ" అన్నాడు గోపాల్రావు.

కొంచెంసేపు ఊరుకొని –

"ఇప్పటికైనా వారు ఏం పనిమీద వచ్చేరో భోగట్టా చేస్తే బాగుంటుంది. ఇప్పటికే ఎనిమిదయ్యింది, నా గడియారంలో" అన్నాడు రాజారావు గోపాల రావు కండ్లలోకి సూటిగా చూస్తూ.

గోపాలరావు శివయ్యకేసి తిరిగి ఏంవిటనేలోగా శివయ్యే ఆరంభించాడు.

"ఆం ఏవీలేదు. వీడు మా పెద్ద కుర్రాడు."

కుర్రాడు భక్తిగా లేచి నమస్కారం చేసి కూర్చున్నాడు.

"శ్రీకాకుళంలో బియస్సీ పాసయ్యేడు. ఫస్టుక్లాసు కూడా వచ్చింది. నాకుండే బరువు భారాలతో రావులపాడేరులో కుటుంబం ఉండగా అటు నేను రాజమండ్రీలో బి.ఇడి. ట్రైనింగ్ అవుతూ – ఇటు వీణ్ని శ్రీకాకుళంలో పెట్టి చదివించవలసివస్తే – నేనెన్ని చిక్కులు పడవలసి వచ్చిందో వాడెన్ని కష్టాల కోర్చాడో అదంతా చెప్పి మిమ్మల్ని విసిగించను. భగవంతుడి దయవల్ల, మీ పెద్దల ఆశీర్వచనంవల్లా వీడు గట్టెక్కిపోయేడు.

పరీక్షలు కాకముందే అనుకుంటాను; ఇక్కడ కొత్తగా పెట్టిన అమెరికన్ కంపెనీలో ఉద్యోగం కోసం దరఖాస్తు పెట్టేడు. వాళ్ళుపెట్టిన వ్రాత పరీక్షలో పాసైనట్టున్నాడు. ఇప్పుడు ఇంటర్వ్యూకి రమ్మని పిల్చేరు –

ఏ మెడికల్ సర్టిఫికేటో – అనుకున్న వ్యవహారం రికమండేషన్లకేసి నడవడం గోపాలరావు గమనిస్తున్నాడు. రాజారావు మాత్రం నిర్లిప్తుడులానే అయినా శ్రద్ధగా వింటున్నాడు.

"ఉన్న పరిస్థితేమంటే – వాళ్ళు మెరిట్ ఒక్కటే చూస్తే మనం చేయవలసే దేమీలేదు. కాక ఇతర విషయాల ప్రమేయం వుంటే దానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలి."

డాక్టరు గోపాలరావు ఇంకా తలవంచే వింటున్నాడు. రాజారావు మాత్రం శివయ్య కళ్ళలోకి చూస్తూ అతను చెప్పిందానికల్లా తలూపుతున్నాడు.

"నా భోగట్టాల్లో తేలిన సంగతేమంటే; మంత్రుల లెవెల్లో రికమండేషనో – మొత్తంగా పెద్ద లంచమో తెచ్చుకోందే పని జరగదని, నాకా సంగతి ముందుగా తెలియదు."

ఈసారి మాత్రం గోపాలరావు తలెత్తి చూసేడు.

"ఈ వూర్లో మా చెల్లెలి మరిది రైల్వేలో చిన్న ఉద్యోగం చేసుకుంటున్నాడు. రామ్మూర్తి పేట దగ్గర రైల్వే క్వార్టర్సులో వాడుంటున్నాడు. వాడు చెప్పేదేమంటే – డబ్బుకు లోపిస్తే అసలు పని జరగదని! ఈ విషయం బస్సులో నేనూ సూచాయిగా విన్నా నమ్మలేదు. ఇక్కడ ఆ కంపెనీ సంగతి తెలిసిన వాళ్ళనూ అందులో పనిచేస్తున్న ఒక వర్కర్నీ అడిగేను. అంతా అది నిజమే" నన్నారు. దానితో ఇక లాభం లేదని ఇవాళ మధ్యాహ్నమల్లా కాళ్ళు విరగదొక్కుకొని మూడువందలు జతపరిచేరు. ఇంకా రెండువందలుంటే కాని చాలదు."

గోపాలరావు గుండె ఝల్లుమన్నది.

అయితే 'యింటావిడ దగ్గర డబ్బు లాగడానికి యిదో మంచి మిష' అనిపించగానే కాస్త నింపాది పడ్డాడు.

గోపాలరావు ముఖంలో మార్పులను పరిశీలిస్తున్న శివయ్య నెమ్మదిగా అన్నాడు:

"నీకు తెలుసు, నేను చిన్నప్పుడు ఎలా ఉండేవాడినో, ఇప్పటికీ అలాగే ఉన్నాను. ఒకరిని యాచించడంగాని మనకోసం ఇతరులను ఇరుకున పెట్టడం గాని నాకు మనస్కరించవు. కాని గత్యంతరం లేని పరిస్థితి – తట్టుకోగల స్థోమత ఉన్నవాడివి – ఆదర్శాలకు పోతే పిల్లవాడి భవిష్యత్తూ, తర్వాతా వాడూ నేనూ కట్టుకొంటున్న గాలిమేడలూ దెబ్బతింటాయి. అందుచేత నీ దగ్గర కొచ్చాను. ఇందులో

నువ్వు చెయ్యగలిగింది యెంత ఉంటే అంత చేయగలవనే నా నమ్మకం. నీ ఋణం ఉంచుకోననీ ఇది చేసిపెడితే నీ ఎడల ఆజన్మాంతం కృతజ్ఞుడుగా ఉంటాననీ నీ పేరు తరతరాలు చెప్పుకుంటా మనీ వెధవ కబుర్లు చెప్పడం నాకు సరిపడదు –"

''అది సరేలే.'' వాక్యం మధ్యలోనే అందుకొని గోపాలరావన్నాడు "ప్రస్తుతం నన్నేం చెయ్యమంటావో చెప్పు."

"అది నువ్వే చెప్పాలి. నువ్వు స్థానికంగా ఉన్నవాడివి. ఊళ్ళో పదిమంది పెద్దల్నీ ఎరిగున్నవాడివి. నేను రాత్రి రైల్లోవచ్చి ఆదరా బాదరా తీసిన భోగట్టాలూ చేసిన ప్రయత్నాలు ఇవి. అసలు నేను తిన్నగా నీ దగ్గరకే రావలసింది. కాని ఇల్లు తెలీదు. ఆ మధ్య పార్వతీశంగాడు నిన్ను కలిసేట్ట. రీడింగ్ రూమ్ దగ్గర వాళ్ళ చుట్టాల యింట వుండగా నువ్వు ఓట్లకోసం ఇంటింటా కేన్వాస్ చేస్తుంటే తారసపడ్డారట. అక్కడే ఎక్కడో వుండుంటాడు – నువ్వా వీధిలో ఎవర్నడిగినా చెప్తారన్నాడు. రామ్మూర్తిపేట దగ్గరున్న మా చెల్లెలు మరిది నడిగితే తను నిన్నెరుగును గాని, నీ యిల్లు తెలియదన్నాడు. వాళ్ళ స్నేహితులు వేసిన నాటకాలకు దేనికో నువ్వు జడ్జిగా వెళ్ళేవుట. నిన్ను పట్టుకుంటే డబ్బు అవసరం లేకుండానే పని జరిగిపోతుందంటాడు ఆయన."

"అవతల పార్టీ ఎవరు?"

"అంటే"

"డబ్బందుకోవలసిన వ్యక్తి."

"అసలు ఇంటర్వ్యూ ఎప్పుడో కనుక్కోండి."

రాజారావు ధోరణి చూడపోతే దాని గురించి ఏదో తెలిసే మాటాడుతున్న వాడిలా కనిపించేదు.

"రేపు"

"రేపా" – అంటూ నోరావులించేదు గోపాలరావు.

"రేపే!" అన్నాడు రాజారావు.

గోపాలరావు వాచీ చూసుకుంటే ఎనిమిదిన్నర అయ్యింది.

"ఇప్పటి కిప్పుడేం చెయ్యగలం" అంటూ మొదట రాజారావువంకా తరువాత శివయ్య వంకా చూసేదు.

శివయ్య ఆనాడు కురిసింన వర్షం సైంధవుడిలా ఎంత అల్లరి పెట్టిందో వివరిస్తున్నాడు.

రాజారావు అడ్డుపడి –

"ఇంతకూ ఆ పార్టీ ఎవరో చెప్పండి" అన్నాడు.

"నాకు సరిగా తెలియదు. ఒకళ్ళ నడిగితే ఎవరో పి.ఆర్.ఓ. అన్నాడు. అతడు మనతో మాట్లాడ్డట. అతడి డ్రైవర్నో వంటవాడ్నో పట్టుకోవాలన్నారు. పట్టుకోవచ్చు. కాని అలాంటి వాళ్ళను నమ్మడంవెలాగు? పనైతే అదెవరి జేబులోకి పోయినా ఫరవాలేదు. పనికాకపోతే? ఒకటా రెండా చీమూనెత్తురుగా కూడపెట్టిందే... ఐదు వందలు! కొత్త వాళ్ళం! తిరిగి ఇస్తారన్న నమ్మకమేమిటి? శివయ్య ప్రశ్నవేసి ఆపేడు.

"సరే రెండో వాడెవడు?"

"పియ్యేట. ఎవరికో దేనికో తెలియదు. పేరు యస్పీ. రావుట."

''యస్పీరావు!'' అని ''యస్పీరావా?'' అన్నాడు గోపాలరావు.

"చిత్తం" అన్నాడు రాజారావు చిరునవ్వు నవ్వుతూ.

"వ్యవహారం చూడగా భోగట్టా విషయంలో నైతేనేం; కార్యశూరత్వంలో నైతేనేం గోపాలరావు కన్న అతని స్నేహితుడే నయమేమో" అనుకుంటున్నాడు శివయ్య. అందుచేత –

"మీకు వారు తెలుసా" అన్నాడు ఆశగా.

"వారి నడగండి" అన్నాడు గోపాలరావుని నిర్దేశిస్తూ.

"యస్పీరావు పోర్టులోకదూ ఉంట."

"ఆర్నెల్లు క్రితం"

''యస్పీరావైతే మనవేదైనా కొంత చెయ్యొచ్చనుకుంటాను" అన్నాడు రాజారావు కళ్ళల్లోకి ఏమంటావన్నట్లు చూస్తూ.

"చెయ్యొచ్చు – అందుకు తగిన పద్ధతితో యత్నిస్తే."

ఎందుచేతో రాజారావు పద్ధతి గోపాలరావుకు నచ్చినట్టు లేదు. "చేస్తే సరియైన పద్ధతిలోనే చేస్తాం" అన్నాడు కొంచెంగా గొంతుపెంచి.

వెంటనే శివయ్య లాల్చీలోపల జేబులోంచి మూడునోట్ల మడతలు తీసి టేబులు మీద పెడుతూ "మూడువందలు" అన్నాడు వినయంగా.

క్షణకాలం అతని ముఖంలోకి చూసేక గోపాలరావు ముఖం దించేసు కున్నాడు. కొంచెంసేపు ఆలోచించి –

"డబ్బు అవసరం లేదనుకుంటాను" అన్నాడు సీరియస్‌గా కనిపిస్తూ.

రాజారావు ముఖంలోకి చూడకుండానే అది మాడి ఉంటుందని చెప్ప గలడు గోపాలరావు. తరువాత అతని ముఖంలోకి చూస్తూ "యేవంటారు" అన్నాడు పెదవులు అదోలా పెట్టి.

"ట్రైవన్స్!" అన్నాడు రాజారావు ఛాలెంజ్ చేస్తున్నట్టు.

వాళ్ళిద్దరూ దేనికోసం కుమ్ములాడుకుంటున్నారో గాని తన కొడుకు భవిష్యత్తుతో చెలగాటలాడ గోరుతున్న గండుపిల్లుల్లా కనపడ్డారు శివయ్యకు. వారికి సంధి చెయ్యబోయే వాడిలా –

"నాయన్నాయనా! ఈ ఒక్కసారికి మాత్రం నీకే ఆదర్శాలున్నా మర్చిపో. పట్టింపులకూ రిస్కుకీ ఇది అదనుకాదు. దీనిమీద మేమెన్నో ఆశలు పెట్టు కున్నాం. ఇద్దరు పిల్లలు చదువులకు రాబోతున్నారు. ఇక్కడ ఇందులో ఉద్యోగం దొరికితే జీతం తగినంత ముట్టడమే కాదు – ఇతరత్రా అయితే ఎదర్కోవలసిన ఖర్చులు చాలా కలిసొస్తాయి. అందుచేత చిన్న పామునైనా పెద్దకర్రతో కొట్టాలన్నాట్టు, చేసే ప్రయత్నమేదో గట్టిది చెయ్యండి. పలుకుబడితోనే పని జరుగుతుందన్నావు. డబ్బు కూడా కలిస్తే పని జరిగి తీరుతుంది. ఐదు వం దలు కాదు. అంతకన్నా ఎక్కువైనా ఏ తలో తాకట్టు పెట్టి తెచ్చుకుంటాను. డబ్బు మూలుగుతోందా అనకండి. అవసరం అట్టిది. వారం రోజులు – మూర్రోజులు గడువు చాలు. ఎంత కావలిస్తే అంతా పుట్టించగలను."

తన గొడవే తనదిగా మాట్లాడుతున్న శివయ్య ధోరణి చెవితో వినడమే ఐతే "యీ మనిషికీ మతి లేదా" అనుకునేవాడు గోపాలరావు. కాని అతని ముఖం చూస్తుండడంవల్ల "సరే" అన్నాడు సానుభూతితో.

"డబ్బు నువ్వు సర్దగలవ్" అందా మనుకుంటున్నాడు శివయ్య. "తొమ్మిది కావచ్చింది" అంటూ రాజారావు లేచాడు.

"ఆ టైము చెప్పడం ఒక్కొక్కళ్ళకి ఒకో విధంగా అర్థమయ్యింది.

"మనం ఎవర్ని కాంటాక్టు చెయ్యడానికైనా ఓ గంట వ్యవధి ఉంది. పది దాటాకా ఎవరూ దొరకరు కదా. రేపొద్దున్న పది గంటలకు ఇంటర్వ్యూ అంటే ఉదయం చెయ్యగలిగేదేమీ లేదు."

"నిజం నిజం" అన్నాడు శివయ్య. అన్నాడుగాని కుర్చీకి అంటుకు పోయినట్టు అందులోంచి కదలడం లేదు.

"మళ్ళా నన్నెప్పుడు కలియమన్నారూ" అన్నాడు శివయ్య ఉభయుల్నీ ఉద్దేశిస్తూ.

"రేపు సాయంత్రం ఈ వేళప్పుడు – ఇక్కడే."

శివయ్య లేచేడుగాని ఏదో అసంతృప్తి పీడిస్తున్న వాడిలా ఉన్నాడు. ఆలోచిస్తున్న గోపాలరావు మాటకోసం ఎదురు చూస్తున్నాడు.

"పోనీ యీ రాత్రికి మా యింటి దగ్గరే ఉంచితే."

"ఇప్పుడు వాళ్ళని ఇంటికెవరు దిగపెడతారు – మనతోపాటు వాళ్ళను అన్ని చోట్లకు తిప్పం గదా."

"నరసింహుల్ని తోడు పంపుదాం. అలా మినర్వామీంచి యింటికెళ్ళి పోతాడు."

"బాగుంది! మీరు ఏ రాత్రికి ఇంటికి వెళ్ళవలసి వస్తుందో, యే పరిస్థితిలో వెళ్ళవలసి వస్తుందో చెప్పగలరా? అర్థరాత్రివేళ ఇంటికొచ్చిన చుట్టాలతో అక్కడా ఇల్లాలి పాట్లు ఆలోచించారా?"

"సరే రేప్పొద్దున్న మీరు నన్ను కలియండి" గోపాలరావు చివరి మాటగా అన్నాడు.

"బాబూ మీకు చెప్పలేం" అనేసి చరచర బయటకుపోయి మళ్ళా అలానే తిరిగి వచ్చి అన్నాడు –

"రేపు పొద్దన్న రామ్మూర్తిపేట నుంచి క్రొత్తగ్రహారం మీ యింటికి వచ్చి, పొలోమంటూ మళ్ళా రామ్మూర్తిపేట పోయి, యిన్ని మెతుకులు కొరికి, పదిగంటల ఇంటర్వ్యూకి వాళ్ళెప్పుడందుతారు? అందినా ఆదరా బాదరా తిరిగిన ఆ కుర్రాడికి మతిస్థిమితం ఏముంటుంది? ఉంటుందనుకుందాం. ఆ రాత్రి పనయ్యేదాకా తిరిగితే మీరు రేప్రొద్దున్న లేవలేరు. పనికాకపోతే రేప్రొద్దున్న మీరు దొరకరు."

నిజమే ననుకున్నారందరూ – ఒక్క గోపాలరావు తప్ప.

"సరే రేపు సాయంత్రమే కలుస్తా"నన్నాడు శివయ్య. ఎందుచేతనో తనుపెద్ద పొరపాటోటి చేస్తున్నట్టనిపించింది అతని మనసులో.

ఆ సరికి అందరూ రోడ్డు మీదకు వచ్చేశారు.

"గుడ్‌నైట్" అన్నాడు రాజారావు క్షణం వ్యవధిలేని వాడిలా.

శివయ్య గుడ్‌బై వింటున్నట్టు నసుగుతున్నాడు. "అన్నట్టు మీవాడేడీ?" అన్నాడు గోపాలరావు కుర్రాడి కోసం చుట్టూ చూస్తూ –

కుర్రాడు అతని చేతికో చీటీ అందిచ్చి "నా పేరూ రిఫరెన్సూ నెంబరూ అందులో రాసేను. సరిపోతుందో లేదో చూడండి" అంటూ మీది జేబులోంచి ఇంటర్వ్యూ కార్డుతీసి అతని చేతిలో పెట్టేడు. వీధి దీపం వెల్తురులో వాటిని పరిశీలించి –

"దస్తూరీ చక్కగా ఉందోయ్. మీవాడు చురుకైనవాడు కూడా. తప్పకుండా జాబొస్తుంది" అన్నాడు శివయ్యతో.

శివయ్య పరధ్యానంగా "ఏదో నీ దయ! మరి మేం వెళ్తాం" అంటున్నాడు. కాని అతడి కాళ్ళు వాళ్ళతోపాటే నడుస్తున్నాయి. అతని యాతన గోపాలరావు పసికట్టలేదుగాని రాజారావు గ్రహించేడు. ఒక వీధి దీపం దగ్గర నిలబెట్టి "ఒక్కమాట" అన్నాడు శివయ్యతో.

శివయ్య అలాటి దానికోసమే ఎదురుచూస్తున్న వాడిలా ఆగిపోయాడు. గోపాలరావు ఏదో ఆలోచిస్తూ ముందుకు పోతున్నాడు. కుర్రాడు వెనక్కీ ముందుకీ ఊగిసలాడి ముందుకే కదుల్తున్నాడు.

"మీ మనసులో ఏదో 'నస' ఉంది – అదేమిటో చెప్పండి

విందాం" అన్నాడు  మామూలుగానే.

"అబ్బెబ్బె ఏమీ లేదే ' ఏమీ లేదు" అంటూ గాభరా పడిపోయేడు శివయ్య. దాని అర్థం – గ్రహించినా గ్రహించనట్టు అన్నాడు రాజారావు.

"అయితే ఒక్కమాట చెప్తాను వినండి! ఇంతవరకూ మీరు చేయగలిగిందల్లా చేసేరు. ఇంక చేయగలదేమీ లేదన్నారు. అవునా? మంచికో, చెడ్డకో ఓ దేవుణ్ణి నమ్ముకున్నట్టు మీ స్నేహితుణ్ణి నమ్ముకొని అతని మీద భారం వేసేరు. మీ స్నేహితుడు ఎలాంటివాడో మీకు చిన్నప్పటినుంచీ బాగా తెలుసు. అతడు మిమ్మల్ని దగా చెయ్యడు గదా! ఇంక నాకు తెలిసినంత వరకూ – ఇటువంటి కార్యాలపట్ల – ఈ ఊర్లో – అందులోనూ ఈ ఆఖరి ఘడియల్లో – పూను కోవాలంటే – అందుకు సమర్థులు ఆయన తప్ప ఇంకెవరూ లేరు. అందుచేత మీరు నిశ్చింతగా వెళ్ళి హాయిగా టోకురు కొడుతూ పడుకోండి.

కార్యం అవుతుందా అవదా అన్న సందేహం మీకొద్దు. ఆ పూచీ మీ భుజాల మీద్ది తీసికెళ్ళి ఇంకొకళ్ళ భుజాలమీద పెట్టేసేరు. 'సంశయాత్మక వినశ్యతి' అన్నాడు శ్రీ కృష్ణ పరమాత్మ! మీ కార్యం జయమై తీరుతుంది – తీరుతుంది. అవకపోతే ఇంక దాన్ని ఎవరు పట్టుకున్నా సాధించలేరనే తెలుసుకోండి. మీ వాడికి – వాడికన్నా మీకు – అదృష్టమన్నది లేశంలో లవలేశం వున్నా జరగడం తప్పదు. ఫెయిలయ్యిందంటే ప్రయత్నలోపంవల్ల కాదని తెలుసుకోండి" అంటూ గీతాబోధ వంటి హితబోధ చేసి గిర్రున తిరిగిపోయేడు టౌనుహాలుకేసి. శివరామయ్య మాష్టారు కొంచెం సేపు మ్రాన్పడి తరువాత కాళ్ళు తేలికబడి మహదానంద సముద్రంలో మనసే తేలిక కాగా కొడుకును వెంటబెట్టుకొని రామ్మూర్తిపేట కేసి నడిచాడు.

### 3

రాజారావు రెండడుగులు వేసి టౌనుహాల్ జంక్షనుకు వచ్చేక –

"ఏమిటి మాట్లాడుతున్నారు మా వాడితో" అన్నాడు గోపాలరావు.

"ఏం వుందీ ఒక చల్లని కబురు, ఒక తీయని మాట–"

ఆలోచనలో ఉన్న గోపాలరావు –

"ఇప్పుడు ఎస్.పి.రావును ఎక్కడ పట్టుకోగలం?" అన్నాడు చెప్పేది పూర్తికాకుండా.

ఇందాక మీరు పుచ్చుకున్న డబ్బు తియ్యండి.

మత్తులోంచి బయటపడ్డ మనిషిలా ఆలోచనల్లోంచి బయటపడ్డాడు గోపాలరావు.

తియ్యండి! టైమైపోతుంది.

"ఇప్పుడు డబ్బు దేనికి?" గోపాలరావు గొంతు మారిపోయింది.

"నాకో యాభైరూపాయలు అప్పియ్యండి."

రాజారావు వంక పురుగును చూసినట్టు చూస్తున్నాడు గోపాలరావు. రాజారావు అతన్ని వెర్రికుట్టెను చూసినట్టు చూస్తున్నాడు గోపాలరావు తీక్షణంగా అడిగాడు –

"మీ వుద్దేశమేమిటి?"

"మీ వుద్దేశమేమిటో చెప్పండి వింటాను."

"మీకు యస్పీరావు తెలియదా?"

"నాకు తెలియదని నేను అనలేదు."

"నా చిన్ననాటి స్నేహితుడికో పనిచేసి పెట్టవలసి వస్తే నేను మీకు లంచమియ్యాలా?"

"నేనప్పడిగేను."

"అప్పపేరే ముసలమ్మ!"

"అదికూడా నా కోసమడగలేదు."

"మీ వాటాకోసం అడిగేరు."

"సరే అడిగాను. తరువాత ఏవిటి?"

"మీద్వారా కాకపోతే ఇంకొకళ్ళ ద్వారా నేను యస్పీ రావును కాంటాక్టు చెయ్యలేననుకుంటున్నారా?"

"అలా ఎందుకనుకుంటాను? మీ వీధిలో రంగారావని ఓ పెద్ద మని షున్నాడు. అతనూ, రావూ క్లోజు చెమ్సు. నే బాగా ఎరుగుదును.

"కదా!"

"వాళ్ళిద్దరూ ఈ వేళప్పుడు ఎక్కడ దొరుకుతారో మీకు తెలియకపోవచ్చు. క్లబ్బు కెళ్తే – కార్డ్సు రూమ్‌లో దొరుకుతారు. పెద్దెత్తున ఆట సాగుతుంటుంది. చిన్న మొత్తమే అయినా ఏదో  ఓ మొత్తం తీసుకెళ్తే మీ రంగారావు నిజంగా సంతోషిస్తాడు. మీరై యస్పీరావుతో ముఖాముఖీ మాటాడరు కదా!"

"వాడు కాకపోతే వాడబ్బ! వాడి యజమాన్నే కలుస్తాను"

"మరీ బాగుంది. ఎప్పుడు ఎవరి ద్వారా?"

రాజారావు చేతిలో అంత చిత్తుగా ఓడిపోవడం గోపాలరావుకు ఇదే ప్రథమ మయ్యుండాలి. అతడిమంట ఇంతా అంతా కాదు. అది గ్రహించి రాజారావన్నాడు.

"– కాబట్టి మీరు కోపం తెచ్చుకొని లాభం లేదు. నాకా యాభయ్యీ పడేయండి. అప్పు పెట్టండి."

"పడేస్తే మీరు యస్పీరావుతో మాట్లాడతారన్న మాట."

"మీరా డబ్బంతా కాదు – నా నిలువెత్తు ధనమిచ్చినా ఆ స్కాండ్రల్‌తో నేను మాటాడను."

"...... ...... ......"

"వాడెవడండీ! వాడి సంగతి మీకేం తెలుసు. వాడెవ్వరికీ ఏ పనీ చెయ్యలేదు. చెయ్యడానికి తలపడ్డాడో అది నిస్సందేహంగా పాడై తీరుతుంది. వాడి క్రిందా పైనా ఉండేవాళ్ళు. వాడిమీద అంత నిఘాగా ఉన్నారు. వీడు పోర్టులో లక్షలు గడించాడన్నది వాళ్ళందరూ ఎరుగుదురు.

"..............."

"ఐతే లోకం – మీరూ, మీ స్నేహితుడూ అనుకునేంతగా కుళ్ళిపోలేదు. రికమండేషన్లూ, లంచాలూ లేవనను. కానీ కొన్ని సీట్లయినా మెరిట్‌కి విడిచి పెడతారు. ఇందాక నేను మీ వాడితో అన్నట్టు వాడి జాతకంలో అదృష్టమన్నది ఏ లేశమున్నా అందులో ఒక ఉద్యోగం దొరుకుతుంది. లేదంటే యీ లేట్ అవర్‌లో మీరైనా చేయగల దేమీలేదు."

కొంతసేపు ఊరుకొని గోపాలరావు అడిగాడు.

"ఈ కబురు ఇందాకే ఏల చెప్పలేదు."

"ఆయనెవరో మీ చిన్ననాటి స్నేహితుడు కాబట్టి."

"అంటే."

"మీరు పుచ్చుకోకపోతే అతనీ రాత్రల్లా జాగరం చేసి తెల్లారకముందు ఆ డ్రైవర్నో, వంటవాణ్నో కలుసుకొని ఆ డబ్బంతా వాడి చేతులలో పోస్తాడు. చాలదంటే అప్పుచేసో, దొంగలాడో ఇంకో ఐదారు వందలు దర్శించు కుంటాడు. మీరు తింటే – బాల్య స్నేహితులు కాబట్టి కొంత అర్థమన్నా వుంది. వాడూ వీడూ తింటే ఏం లాభం చెప్పండీ"

"..........."

"లేదూ మీ అంతరాత్మ కరుస్తుందంటారూ, రేపు సాయంకాలం అతనిక్కడ కొచ్చినప్పుడు –పనిగాకపోతే కాలేదని చెప్పి ఇచ్చేయండి. పనైతే డబ్బు ఖర్చు అవసరం లేకుండానే పని జరిగిందని చెప్పండి. తిరుపతి వెంకట్రవణ మూర్తి అంతవాడు ఒత్తికొత్తినే ఎంతో క్రెడిట్ కొట్టేస్తున్నాడు. మీరంతవారు కాదు – కాబట్టే మీ తాహతుకు తగ్గట్టు మీరూ కొంత కొట్టడం తప్పుకాదు. ఇది నా అభిప్రాయం."

గోపాలరావు నోరు కట్టేసింది. అది గ్రహించగానే –

"నా యాభై యిలా పడేయండి" అన్నాడు నవ్వుతూ.

డాక్టరు వేణుగోపాలరావు జేబులోంచి ఓ వంద మడత తీసి రాజారావు కివ్వబోయేడు; మళ్ళా యేమనుకున్నాడో ఏభై లెక్కపెట్టి ఇచ్చి మిగతా జేబులో పెట్టేసుకున్నాడు. యింకో అరగంట తరువాత ఝామ్మంటూ టాక్సీలోవెళ్ళి శ్రీమతి మీనాక్షీ దేవిగారి పోర్టికోలో అవతరించేడు.

**4**

మర్నాడు ప్రొద్దున –

పులుగడిగిన ముత్యంలా తడితడిగా తళతళమని మెరిసిపడే నగరంపై ఎండ ఫెళ్ళున పేల్చేస్తోంది.

పది దాటి పదకొండై పన్నెండు పన్నెండున్నర బూరా కూడా ఊదేసింది.

నగరానికి అవతలిదరి బీచొడ్డున మేడమీద డాక్టరు గోపాలరావు గారి బెడ్‌రూమ్ చీకటిగా వుంది. ప్రక్కనున్న గది తలుపు బార్లా తెరచి ఉండడంవల్ల మధ్య తలుపు సందుగుండా ఓ వెలుతురు రేఖ గచ్చుమీదపడి మిలమిలా మెరుస్తోంది. బద్ధకంగా మంచంమీద పడుకొని ఆ వెలుతురు రేఖలో పడే నీడల్నిబట్టి అవతలి గదిలో ఏం జరుగుతోందో ఊహిస్తూ కాలక్షేపం చేయడం డాక్టరుగారికి చిరకాలం నుండి అలవాటైపోయిన .... (యేమంటాం?) సరదా అనవచ్చు.

అప్పుడే తెలివొచ్చేసరికి పనిపిల్ల తలుపు మెల్లిగా ఒత్తిగించి తనకేసి చూస్తోంది. తన కళ్ళు ఆ చీకట్లో గుడ్లగూబ కళ్ళలా మెరుస్తుండి ఉండాలి. అందుచేతే చప్పున తలుపేసుకు వెళ్ళిపోయింది. అంటే ఇంక కాఫీ ఒస్తుందన్న మాట.

వేడి వేడి చిక్కటి ఎర్రని తెల్లని తరకలతో కాఫీ తలపున పారగానే డాక్టర్ కడుపులో గందరగోళం బయలుదేరింది. చిన్న తేనుపు వచ్చినట్టు కాగా వైటు హార్సు ఫ్యూమ్సు నాసా పుటాల్లోంచి ప్రాకి మెదడులో గత రాత్రి మధురానుభూతుల్ని తరచి తరచి కదుపుతున్నాయి. ఈ చీకటి లేదుగాని వెలుతుర్లోనే చీకటి నిండిన మీనాక్షి దేవి బెడ్‌రూములో (తనే దశలో ఉన్నాడో గుర్తుకు రావడంలేదు.) "కొందరు తాగేసి గొడ్డుల్లా పడుకుంటారు" అన్న మీనాక్షీదేవి మాటలు జ్ఞప్తికి వచ్చేయి. యిప్పుడు తానెలా పడుకున్నాడో చూచుకోవాలనిపించింది. కదలకుండా అద్దంకేసి కళ్ళు తిప్పబోయాడు. సాధ్యంకాక స్పర్శజ్ఞానం ద్వారా తనస్థితి తెలుసుకోబోయేడు. తెలిసిందానితో సిగ్గుపడి, ఒత్తిగిల్లి, గళ్ళులుంగీ సర్దుకొని, వెల్లకిలా పడుకొని, మరొకసారి సర్దుకొని, చేతులు రెండూ ఎత్తి తలకింద ఉంచుకున్నాడు. ఒళ్ళు చులాగ్గానే ఉండడం కాళ్ళూ చేతులు స్వాధీనంలోనే ఉండడం అతనికి చాలా ఆనందా నిచ్చేయి. ఆనందాన్నేకాక చెదురుతున్న ఆత్మ విశ్వాసాన్ని కుదుటపరిచేయి. అర్ధములుగా ఉన్న కనురెప్పల్ని కదుపుతూ హాయి ననుభవిస్తున్నాడు.

పనిపిల్ల వచ్చేసరికి కిటికీ తలుపులు తెరచి కర్టెనులు మూయవలసిన మేరకు మూసి గదిలో వెలుగును సమపాళ్ళలో సర్దింది.

పక్కదులిపి సరిగా వేసినట్టుంది. గది ఊద్చే సన్నాహంలో ఉంది. నున్నగా పరచిన మెత్తటి పక్క చూసేసరికి డాక్టరుకు మనసులో ఎన్నెన్నో గదులూ, మంచాలూ, పరుపులూ

మెదిలేయ్. అలవాటు ప్రకారం – అతడు మంచం నడిమధ్య మఠం వేసుకుని నిటారుగా కూర్చొని, అలా ఎన్నోసార్లు కూర్చున్న తన విశ్వరూపాన్ని చూస్తూ సిగరెట్ వెలిగించేడు. డాక్టరుకి ఆ మూడ్‌లో ప్రపంచమంతా తన పాదాలకిందో, ముందో, చెంతో ఉన్నట్టు అనిపిస్తుంది. అలా అనిపించడం అప్పుడు – హాయిగా వున్నా ఒక్కొక్కప్పుడు అది చాలా అసహ్యం కలిగిస్తుంది.

ఆ అసహ్యం కలిగేటప్పుడు గోపాలరావు తనను తాను నిందించుకోవడానికి బదులు తన రక్తాన్ని నిందించుకొంటాడు.

"కాఫీ సల్లారి పోతోంది బాబూ" అంది పనిపిల్ల. ఎదురుగా ఉన్న స్టూల్‌పై రెండో కప్పు కాఫీ మూతతో రెడీగా ఉంది.

"ఏఁవే పిల్లా! నా కోసం ఎవరేనా వచ్చారే?" అన్నాడు గోపాల్రావు కాఫీ తాగుతూ.

పిల్ల "నేదు" అంది తలెత్తకుండానే. చిన్న ముతకలాగూ, రంగువెలసి మాసిన పువ్వుల కబ్బా వేసుకొని తనకన్న పొడవైన కొండచీపురు పట్టుకొని మెడలో పిన్నులు వ్రేలాడే పగడాల తావళం ఊగులాడుతుండగా వెనుదిరిగి వంగి ఊడుస్తోంది. ఆకస్మాత్తుగా ఏదో జ్ఞాపకం వచ్చిన దానిలా చప్‌న నిలబడి డాక్టరుకేసి తిరుగుతూ "ఆఁ వచ్చినారు బాబూ" అంది తలతో కళ్ళతో అభినయిస్తూ.

"మరిందాకా నేదన్నావ్" అన్నాడు గోపాల్రావు వెక్కిరిస్తూ.

పిల్ల కిలకిలా నవ్వింది.

గోపాలరావు గలగలా నవ్వలేక పాచిదంతాలు మూసుకుంటూ – ఓ కుంటి నవ్వు నవ్వేడు.

కాఫీ కప్పు టీపాయ్ మీద పెడుతూ "ఎవరాయన?" అన్నాడు మామూ లుగా.

"ఎవరో నానడగనేదు. మీర్నేరంటే మరోసారి ఒత్తానని వెళ్ళిపోనారు."

"అమ్మగారాయనతో మాటాడలేదా?"

"ఆరూ నేరు. భోజనాలు కాగానే సత్తెవాతమ్మగారింటి కెలిపోనారు."

సత్యవతంటే ఆ హిడింబాసురి. ఆ హిడింబాసురి మొగుడే యస్పీరావు తాలూకు పేకాట ఫ్రెండు రంగారావు.

"ఈసారి ఎవరైనా వస్తే పేరు కనుక్కుంటుండే" అన్నాడు గోపాలరావు.

"అనాగే బాబూ" అంటూ చీపురు పట్టుకొని క్రిందకి దిగిపోయింది.

అయిన దానికీ కాని దానికీ అనవసరంగా హైరాణా పడటం పూర్వం ఒకప్పుడు చేసేవాడు గోపాలరావు. ఇప్పుడు సమస్య వచ్చి ఎదురుపడితే తప్ప దాని గురించి ఆలోచించడం ప్రాజ్ఞులు చెయ్యవలసేపని కాదని బాగా తెలుసుకున్నాడు. ఆ వచ్చింది శివయ్య కాదనడానికి యేవిధంగా చూసినా అవకాశం లేదు. ఒకవేళ శివయ్యే అయినా ఎలా కావలస్తే అలా కథ నడపగల సామర్థ్యం ఇప్పుడు సంపాదించేడు. అందుచేత ఫరవాలేదు.

ఐదు నిముషాలు గడవకముందే ఓ పేరు కనుక్కొని పైకి వచ్చింది పనిపిల్ల.

"ఎవురో శివొయ్య గోరట బాబూ – పండు జుత్తూ ఆయీని ముసిలోయిన లాగున్నాడు. ఇందాకొచ్చి నోరూ ఆ బాబే! మీదో అరిజెంటుగా మాటాడ తారంట. నేకపోతే అమ్మగోర్నయినా పిలవమంటన్నారు."

ఏవంటారు అన్నట్టు చూస్తూ నిల్చుంది.

"వస్తున్నా పద" అంటూ ఐదు నిముషాల తరువాత మేడ దిగాడు డాక్టరు గోపాల్రావు.

గళ్ళలుంగీ. నీలం టర్కీ తువాళ్ళలో దాగని నల్లని బొచ్చు విగ్రహం. సబ్బుతో జిడ్డొదిలినా కండ్ల మత్తొదలని దళసరిపాటి – అప్పుడే కోటా కడిగినట్టున్న ముతక మొహం – మేడ మెట్లు దిగుతున్న గోపాల్రావును చూసి అల్లంత దూరం నుండే అన్నాడు శివయ్య.

"కృతజ్ఞుణ్ణిరా గోపాలం! నువ్వు చేసిన పని నేనూ, నా కొడుకూ బ్రతికున్నంత కాలం మరచిపోలేం. నీ కోసం ఇది రెండవసారి రావడం!" అన్నాడు పెద్ద గొంతుతో.

డాక్టరుకు దడదడ లాడింది.

"యేఁవయ్యిందిరా? ఇంటర్వ్యూ అయిపోయిందేఁవిటి" అన్నాడు ఆతృత ప్రదర్శిస్తూ.

"పదిన్నరకే బయటికొచ్చేసేడు మనవాడు. ముందుగా లోపలి కెళ్ళినవాడు మనవాడే."

"సెలక్టు కాలేదా?"

"ఎందుకు కాదూ, నువ్వు పట్టుకోడం, కాకపోవడమూనా? రేపే వైద్య పరీక్షకు హాజరు కావాలన్నారు."

చేత్తో పట్టుకొచ్చిన కండ్లద్దాలు తగిలించుకొని స్నేహితుని ముఖంలో వెలిగే అచ్చమైన ఆనందాన్ని కూడా చూసేక "థేంక్ గాడ్! కూర్చో" అంటూ తనూ ఓ కుర్చీలో కూలబడ్డాడు డాక్టరు.

శివయ్య కుర్చీ అంచున కూర్చొని వాళ్ళడిగిన ప్రశ్నలూ, తన కొడుకు చెప్పిన సమాధానాలూ పట్టరాని ఉత్సాహంతో చెప్పుకుపోతూ అన్నాడు.

"నీకీ ఊళ్లో తెలిసిన వారెవరైనా ఉన్నారా అని అడిగేరుట.

మనవాడు తడుంకోకుండా నీ పేరు చెప్పేసేడుట. అతను మీకు చుట్టమా అని అడిగారుట. లేదు నాన్నగారి బాల్య స్నేహితుడన్నాడట. ఈ ఊర్లో ఎక్కడ దిగావు అంటే, మీ ఇంటే అని కూయబోయి అబద్ధం ఆడ్డం అనవసరమనుకొని నిజమే చెప్పేసే డట. ఏదైతేనేం – నువ్వు సెలక్టయితే రేపు మెడికల్ చెకప్‌కి నిలిచి ఎల్లుండి జాయినవగలవా అన్నారట. ఆక్షణాన కూడా తానా రెంటికీ సిద్ధమేనని చెప్పేడు. అంత ఆత్రత ఏం అన్నాడట – బోర్డులో ఒకడు. ఆతృతకాదు నేనెప్పుడయినా ఏ పనికైనా సిద్ధమే అన్నాట్ట. నువ్వు స్కౌటువా అంటే మూడేళ్ళ శిక్షణ పొందే నన్నాడు.. ఈ ఉద్యోగం దొరక్కపోతే ఏం చేస్తావన్నారు. నాకా నిరాశ లేదు. మీరాముక్క చెప్పేకగాని నేను దాని గురించి ఆలోచించనన్నాట్ట. వాళ్ళు నవ్వుకుంటూ "మేమూ ఆ ముక్క చెప్పం. రేపు ఆరోగ్య పరీక్షకు సిద్ధమౌ – నీకో కాగితమిస్తారు" అంటూ పంపించేశారు.

"మీవాడు కత్తోయ్! నే నప్పుడే చెప్పేను. మీవాడికి తప్పకుండా ఉద్యోగ మౌతుందని" తాగుతున్న సిగరెట్‌ను ఆనందిస్తూ అన్నాడు గోపాలరావు.

"అన్నావనుకో! కాని నీకున్న ధైర్యం నా కెక్కడుంటుంది చెప్పు. నిన్న నా కుటుంబ పరిస్థితులన్నీ వివరంగా చెప్పలేదు. చెబితే మరీ దేబిరింపుగా ఉంటుందని అసహ్యం వేసింది. పేకాడేవాడు కళ్ళు మూసుకొని బ్లైయిండ్‌లు ఒడ్డినట్టు నా బియ్యాడి ట్రైనింగ్‌కూ, మావాడి బియస్సీకీ అప్పులు చేసేను. పెళ్ళీడు పిల్లను ఇంట్లో పెట్టుకొని కూడా మగవాళ్ళ చదువులకు అప్పులు చేస్తుంటే మా బంధువర్గం యీసడింపు ఇంతా అంతా కాదు. ఇప్పట్లో ఉద్యోగం దొరక్కపోతే నేను దివాలా. అనకూడదుగాని 'వాడిమీద అంత మదువు పెడుతున్నాననే, కొన్ని కొన్నిచోట్ల జరిగినట్టు వాడేమైనా అయితే భగవంతుడా ఏం దారి' అనుకుంటాను – ఒక్కొక్కప్పుడు. ఏదో భగవంతుడింత వరకూ చల్లగా చూశాడు. ఇప్పుడీ ఉద్యోగం ఇంకో ఐదారు వందలు మదువు కావాలంది. ధైర్యంగా పెడతాను. ఐవేజుంటే పరపతి పుట్టక పోదు.కాని ఏఁవైనా అయితే అన్న భయం యీ క్షణాన కూడా నన్ను విడవదు."

శివయ్య క్షణం సేపాగి అన్నాడు.

"ఒరేయ్ బ్రతుకులో భయమంత పాపిష్టిది ఇంకొకటి లేదు. అన్నీ తెలిసిన వాణ్ణి కూడా అది పరమ మూఢుణ్ని చేసేస్తుంది. ఉద్యోగం దొరకదను – సీటు చిక్కదను – భయపెట్టు మానవుణ్ణి – వసుదేవుడో వాసుదేవుడో గాడిదో ఎవడి కాళ్ళందితే వాడికాళ్ళు గట్టిగా పట్టుకుంటాడు – మానవుడు. నిన్న నా పాలిట దేవుళ్లా నువ్వే అగుపడకపోతే నేను వెళ్ళి ఆ వంటవాడి పాదాలమీద పడి వుందును. వాడు అందిన కాడికి చేత బట్టుకొని ఆ పైన ఎన్ని తిప్పలు పెట్టేవాడో ఆ భగవంతుడి కెరుక" అన్నాడు చేతులు జోడిస్తూ.

రాజారావు ఈ మనిషిని ఎంత చక్కగా అంచనా వేసేడో అనుకున్నాడు డాక్టరు. అతని మౌనాన్ని ఇంకోలా అర్థం చేసుకొని శివరామయ్య అన్నాడు.

"క్షమించాలిరా, నా ఆనందోత్సాహాలతో ఏదో సోదిచెప్తూ, వచ్చిన పని మరచేను. నేను అర్జంటుగా ఇంటికి వెళ్ళి రావలసుంది. ఇప్పుడు రెండు గంటల బస్సులో బయలుదేరి ఊరుకెళ్తున్నాను; సాయంకాలం కలుస్తామను కున్నాం కదా! ఎదురు చూస్తారేమో చెప్పిపోదామనీ, ఈ శుభవార్త ముందుగా నీ చెవినే వేయవచ్చనీ, ఇలా వచ్చేను. నీకెలాగా ముందే చెప్పేశాను. నా తరపునా నా కొడుకు తరపునా రాజారావు గారిక్కూడా మరీ మరీ థేంక్సని చెప్పు. యిలా ప్రత్యేకం వచ్చి కలిసేనని చెప్పు; పన్నెండున్నరకైతే నాకు డైరెక్టు బస్సుంది. నిన్ను కలియందే వెళ్ళిపోటాని కిష్టంలేక బస్సుస్టాండుకి బయలుదేరేవాణ్ణే వచ్చేశాను. నువ్వింకా లేవలేదంటే అలావెళ్ళి మళ్ళా వచ్చేను. అన్నట్టు నీకు రాత్రల్లా నిద్దర్లేదనుకుంటాను!"

"మరే" డాక్టరు బద్ధకంగా ఆవులించి అన్నాడు. "తిరిగి తిరిగొచ్చేసరికి తెల్లారుజాము మూడైపోయింది."

''ఏం చేస్తాం. ఒక పేద స్నేహితుడి కోసం శ్రమపడ్డాననుకో''

"పోరా వెధవ కబుర్లూ నువ్వూ" అంటూ ఫూ ఫూ చేయవలసింది గోపాలరావు. కాని ఎందుచేతనో నవ్వేసి ఊరుకున్నాడు. మనిషి నిద్రమత్తునుండి కోలుకోలేదు అనుకుంటూ శివయ్య అన్నాడు.

"ఇక నే పోయొస్తాను – బస్సుకు టైమయ్యింది."

అప్పుడైనా డాక్టరు 'అదేమిరా?' అనలేదు.

ఇంటికొచ్చిన మనిషి భోజనం చేయకుండా వెళ్ళిపోతానంటే బాల్య స్నేహితుడు వదులుతాడా అనీ, పెద్దకొడుక్కి పెద్ద ఉద్యోగం దొరికిన సందర్భంలో ప్రయాణమంటే ససేమిరా వలదడనీ, తను డబ్బవసరం కొద్దీ వెళ్ళక తప్పదంటే వెధవ డబ్బు నేనిస్తాను – అన్నా అనవచ్చనీ ఎన్నెన్నో అనుకున్నాడు శివరామయ్య; ఆ ఊహలన్నీ భ్రమలని చెప్తున్నట్టు "సరే మళ్ళా కలుద్దాం" అంటూ లేచిపోయేడు శివరామయ్యతో పాటే డాక్టరు కూడా.

## 5

ఆ రాత్రి వెన్నెలరేడు పడమటకొండ వెనక మునిగాక – చుక్కలు ఆకాశంలో నిక్కి నిక్కి చూసేవేళ – నిద్రమత్తుకు జోగేనిశాచరులు, ప్రభాత మందానిలాల స్పర్శల కొత్తిగిలి

తెలివి తెచ్చుకొంటున్న జనాలకు, నగరాన్నప్పగింతలు పెట్టనున్న సమయంలో – మీనాక్షిదేవిగారి రెండవ అంతస్తు నంటిపెట్టుకొని ఉన్న డాబాపై రెండు మడత కుర్చీలూ, ఒక టీపాయీ, కొద్దిగా గాజు సామానులూ, ఐదారు పొట్లాలూ రెండు మూడు తలగడాలూ, ఒక బెడ్‌షీటూ చిందర వందరగా నలుపులు చుట్టుకొని పడివున్నాయి. శ్రీ మహావిష్ణువు శేషశాయియైన విధంగా శ్రీవారు శయనించి ఉండగా మీనాక్షిదేవిగారు ఆధునిక లక్ష్మీదేవుల ఫోజులో మడతకుర్చీ అలంకరించి వున్నారు.

"అంటే దానర్థ మేమిటో గ్రహించావా?" చిన్ననాటి ముచ్చట్లు చెపుతూ శివయ్య పునస్సమాగం దగ్గరకొచ్చాడు గోపాలం. జ్ఞానసారమంతా సారవతి కందిస్తూ ఇలా అంటున్నాడు – "అనగా ఈ లోకంలో ఒకరి కొకరు ఏదో అవుతారన్నది ఒట్టి కల్ల. తండ్రి కొడుకొక్కతడన్నది ఒట్టిది. కొడుకుకీ పెళ్ళాం ఏమీ కాదు. పెళ్ళానికి మొగుడు అసలే ఏమీ కాలేదు. చుట్టపక్కాలూ, చుట్టరి కాలూ, స్నేహితులూ అంతా ఒట్టిది. మనిషి మనిషితో కలిసి తిరుగుతాడంటే (ఆడమనిషీ, పోతుమనిషీ కావచ్చు, పోతూ పోతూ, ఆడా ఆడా కావచ్చు ఎవరైనా) ఎందుకు కలసి తిరుగుతారంటే – అవసరం! ఆ అవసరాన్నిబట్టే అన్ని తిరుగుళ్ళూ! మా ఫ్రెండ్ రాజారావున్నాడు – అయ్యామ్ సారీ మన ఫ్రెండ్ – వాడు మనతో ఎందుకు స్నేహంగా ఉంటాడో నీకు తెలియకపోవచ్చు కాని నాకు తెలుసు. వాడితో నేనెందుకు స్నేహంగా ఉంటానో నువ్వెరుగుదువు – నేనింరాక చెప్పేను కూడా. స్నేహమంటే ఇంతే. అది బాల్య స్నేహమవ్వచ్చు. – ఆ స్నేహం ... ... ఈ స్నేహం... ఏ స్నేహమన్నా కానీ – ఏదయినా పేరు తేడాయేగాని సరుకొక్కటే. ఇప్పుడు నేను చెప్పిన శివయ్యగాడే వున్నాడు. వాడు బ్రూటస్‌ను పొగిడిన కీసియస్ లాటివాడు. వాడికి జనం సింపతీ లాగేయడం తెలుసు. కాళ్ళు దొరికితే కాళ్ళు, పిలక దొరికితే పిలకా పట్టేసి పని చేయించుకోవడం తెలుసు. "పని – మనుష"ల దగ్గర ఎన్ని లంజ వేషాలుండాలో అన్నీ వాడి దగ్గర వున్నాయి. లేదనమనూ – కాదు లేదని నా ఎదురుగా వచ్చి గుండెమీద చేయేసుకోమను! నేనో ప్రశ్నడుగుతాను. వాడు నిజమైన ఫ్రెండ్ అయితే ఇన్నేళ్ళయి – అంటే ఈ పాతికేళ్ళయి – యెక్కడ చచ్చిపోయేడు? నా యింట పీనుగులు పోయేయి. నేను నటచక్రవర్తి నయ్యాను. నేను యమ్మెల్సీ అయినప్పుడల్లా వాడో కార్డుముక్క రాసేడా, నిజం చెప్పమనూ! ఫ్రెండ్ కాకపోతే ఇప్పుడేముఖం పెట్టుకొని వచ్చేడు – నా ఎదురుగుండా – నా కిది చెయ్, నా కొడుక్కిది చెయ్ అంటూ, వాడిలో రోగరీ గ్రహించేకే వాడంటే నా కసహ్యం పుట్టింది, మొదటల్లా నిజంగానే సహాయం చేద్దామనుకున్నాను. సాధ్యం కాదంటే వాడుకున్న డబ్బు భర్తీచేసి మొత్తం డబ్బిచ్చేదా మనుకున్నాను. వాడు వెళ్ళిపోతూ పోతూ ఓ పని చేసేడు. మూడు వందలు కాదు, ముప్ఫయి వందలైనా లంచమిస్తానన్నాడు. థేంక్స్ చెప్పడానికి వచ్చి యిచ్చింది సరిపోయిందా లేదా? అసలిచ్చావా లేదా? అనైనా మాటవరసకైనా అడగలేదు. ఎందుచేతంటావు? – నే చెప్పాను, వాడి పనైపోయింది. అందుకే వాడంటే –వాడూ ఒక రోగేనని నిశ్చయించే సేను. అవకాశం వుండి ఖర్చు పెడితే ఏరుదాటించిన తెప్ప తగల బడిపోయి నట్టే కదా! అందుచేతేయిలాగన్నాను. "ఒరే! రోగ్, యీ నాటికి నువు రోగ్‌వి! అయితే – మనం ఎప్పుణ్ణుంచో రోగులకు రోగులమై వున్నాము. కాబట్టి నువ్విచ్చిందాంట్లో నీ కొక్క పైసాకూడా తిరిగి రాదు. అదే నీకు నేను వేసే ఫైన్. వెర్రివెధవ్వై అడిగావో చచ్చేవే. ఇంకా రెండు వందలు నువ్వే ఇవ్వవల సింది, ఇచ్చేయమంటాను. బహుశా ఈ పరిస్థితి వస్తుందని తెలిసే అనుకుంటాను ఆ డబ్బు గురించి టక్కు పెట్టేసేడు దొంగ వెధవ. వెధవన్నర వెధవ, రోగ్ వెధవ..."

"మూడు రూపాయల కోసం మూడు పీకలు కోయగల మనుషులున్నారు ఈ లోకంలో. వాళ్ళకీ ఏవో థీరీలు ఉండే ఉంటాయి. అలాటప్పుడు మూడు వందల కోసం డాక్టరు ఓ ముండమోపి థియరీ తీసేడంటే వింత కాదనుకొంది" మీనాక్షిదేవి.

లోకంలో స్నేహమే లేదంటే ఆమె భావనాలోకంలో బ్రతుక్కి అర్థమే లేకుండా పోతుంది మరి!

అవును అదీ ఓ థీరీయే. ★

*(యువ మాసపత్రిక: ఏప్రిల్ 1969)*